

రాయసం వేంకటశివుడు గారు, యం. ఏ., యల్. టి.

సీతాకాంతుని శోకము

"దుఃఖితే మనసి సర్వమసహ్యమ్." మనసు విచారములో మునిఁగియుండునపుడు లోకమంతయు నసహ్యముగఁ దోఁచును. దుఃఖమును, అకాలవైరాగ్యమును హృదయము నలముకొనుటచేత, మనప్రేమకుఁ దానలమగు మనుజులును, మనము కొనసాగింపఁగల యుద్యమములును ప్రపంచమున లేనట్లు గానవచ్చును. ఒకటేల? భూమియే గొడ్డువోయి నటు లుండును. కన్నుల కీధరణీతలమున నొక పచ్చని మొక్కయైనఁ గానరాక, అంతయు దరిలేని యిసుకయెడారివలె నుండును.

సీతాకాంత మిప్పుడట్టి దుఃఖమున కగ్గమయ్యెను. కొన్ని సంవత్సరముల క్రిందట నతనికిఁ గలిగిన నష్టమపారమైనదే. అది యెంతవంత గలిగించినను, వ్యాపార సంబంధమగు నష్టమే. కావున శీఘ్రముననె యతఁడు తెప్పిఱిల్లెను. కాని దానికిని, ఇపుడాతని కాపాదిల్లిన యిక్కట్టునకును బోలికయే లేదు. చేతికెదిగిన చెట్టంత కొడుకు కూలిపోవుటకన్న దురదృష్ట మీలోకమునఁ గలదా? వేఱుసంతతి లేకపోవుటయు, తానును, భార్యయు నడివయస్సు దాఁటియుండుటయు వాని దుఃఖమును ద్విగుణీకరించెను. అతఁ డెన్నియో మంచికార్యములు చేసియుండెను. కాని యవియేవియుఁ గుమారుని గండమునుండి కావవయ్యెను! సీతాకాంత మీలోకమున నిఁకఁ జేయవలసినకార్యము లేవి? లోకమునకు వానికి నిఁక సంబంధ మేమి? "విఫల మనోరథుఁడనైన నే నేల కష్టపడవలయును? ఎవరికొఱకు? భోగములేల? వినోదములు వ్యాపారములు నేల?" అని యతఁడు వైరాగ్యమూని తన యుద్యోగమును, ఇతరులతోడి సంబంధమును విడిచివైచెను. ఇపు డతనివ్యాపారమంతయు పగలెల్ల వాకిట పచారుచేయుటయు, రాత్రులు మంచము గఱచి పట్టుకొని పండుకొని యుండుటయును.

మనుష్య ముఖావలోకనమే సీతాకాంతమునకు దుస్సహమగుటవలన ఎల్లపుడు వారివీథితలుపు వేసియుండును. కుమారుని మొదటిమాసికమునాఁటి మధ్యాహ్నము వెఱ్ఱికోపము విచారమును నాతని మనస్సు నావహించెను. గొడ్డలిఁదీసికొని, దొడ్డిలోనున్న చెట్లన్నియు నతఁడు గొట్టివైచెను. దీర్ఘవిచారముతో ముసుఁగుపెట్టుకొని యరుఁగుమీఁదఁ

బందుకొనియున్న జానకమ్మ భర్తచేయుచుని గనులారఁ జూచుచుండెను. మగవారికంటె

'గొడ్డలి తీసికొని, దొడ్డిలోనున్న చెట్లనియు నతఁడు గొట్టివైచెను.'

నాఁడువారికిఁ జెట్లయం దెక్కువప్రీతి. ఐనను, చేతులారఁ బెంచిన తనయుఁడే సమసిపప్పుడు, ఈపాడుచెట్లు ప్రగ్గుట కావనిత వనటఁ జెందునా? ఇదిగాక తా నెంతటి దుఃఖమున నున్నను, ఒకకంటఁ బతిసేమ మాసాధ్వి గనిపెట్టుచునే యుండును. తనకమృపుచిచ్చు తుది లేనిదయ్యెను, మీఁదుమిక్కిలి నడివయస్సు దాఁటిన తనభర్త కీవిపత్తుగలుగుట కాయింతి యెంతయు వగచెను. అసలన్నియు సుతుని మీఁదఁబెట్టుకొనిన ముసలివానిసంగతి యిటులయ్యెనని తలపోయునపుడు, జానకమ్మయుమ్మలిక మధికమగుచుండును. కావున నీవిధమునైన నాథుని మనమునకు వ్యావర్తనము గలిగి యతఁడు దుఃఖోపశాంతి గనుచున్నాఁడని యామె మనస్సును సమాధాన పఱుచుకొనెను. వృక్షచ్ఛేదనము నెఱపి గొడ్డలి నొకమూలవైచి, సీతాకాంతము కూర్చుండి "అమ్మయ్యా! ఇప్పటికైనది! చనిపోయిన తనయునికంటె నీచెట్లెక్కువా? ఇవి యెపుడు తమ్మునాటిన వానినే జ్ఞప్తిచేయుచు, మనస్సును బాధించుచుండును. మొక్కలు మొదలంటఁగోసివైచినమనమిఁక పుత్త్రకునిమీఁది మోహమును మునుముట్ట గోసివేయఁగలము సుమీ!"యని వెఱ్ఱినవ్వు నవ్వి యతఁడు సతి నూరడించెను.

బిళ్లగన్నేరు మొక్క

తనహృదయ సీమవలెనే పెరడంతయు నెడారియగుటవలన సీతాకాంతమునకు వెఱ్ఱిసంతసము గలిగెను. ప్రేమ మిత్త్రత్వముల కీప్రపంచ మనువగు ప్రదేశముగానట్టి పచ్చని యాకుగాని, ఎఱ్ఱనిపూవుగాని తలచూపుటకు తమదొడ్డి యుచితప్రదేశము గారాదని యతఁడు నిర్ధారణము చేసికొనెను. ఏమూలనో గడ్డిమొలక యొకటి గానవచ్చెనా యచటికిఁ బోయి దానినిఁ బెఱికివైచినఁగాని సీతాకాంతముమనసు కుదుటఁబడదు! ఒకనాఁ డితఁడు వాకిటఁ దిరుగుచు దూరమున నొక పచ్చని మొలకఁజూచి, యాగ్రహావేశ పరవశుఁడై, యింటిలోనికిఁజని కత్తితీసికొని, వేవేగమే యాతావునకుఁ బోయెను. దైవ వైపరీత్యమునఁ బతికిఁ గలిగిన తాత్కాలికమగు నీమతిభ్రమణమున కచ్చెరువందుచు జానకమ్మ భర్త

జాడలు గనిపెట్టుచుండెను. సీతాకాంత మం తనాపచ్చనిచోటి కరిగి, "భయములేక నీవు చిగిరించుచున్నావా? ఉండు, నీపనిపట్టెదను" అని యామొక్క వేరుపట్టి లాగి, అది తెగక పోవుటచేత కత్తితో చుట్టును ద్రవ్వసాగెను. చెట్టిదివఱకే చచ్చిపోయినను, వేరు నాశ్ర యించుకొని చిన్నకొమ్మయొకటి పైకిలేచెను. వేరు కదలుటచేత నిపుడాకొమ్మ భయముచే వణఁకుచున్నదాయనునట్టు సంచలింపసాగెను. కొమ్మనిండ చిన్నయాకులు మొగ్గలును గాన వచ్చెను. ఇదిచూచి సీతాకాంతముక న్నొకింత చెమ్మగిల్లెను. కత్తితాఁకుడుచేఁ గదలుచుండు బిళ్లగన్నేరు మొక్కను జూచునపుడు మృత్యు వాసన్నమగునప్పటి తనతనయుఁ డతని జ్ఞప్తికి

"అతనికన్నులనుండి యశ్రువు లోడికలుగట్టెను"

వచ్చెను! వెంటనే కత్తినేలపైచి యొకమూల కొఱగిన యతనికన్నులనుండి యశ్రువు లోడి కలుగట్టెను. ఇది యంతయుఁ గనిపెట్టుచుం డిన జానకమ్మ భర్తనుజేరవచ్చి చేతనున్న చెంబులోని యుదకముతో సొమ్మసిల్లిన పతి ముఖమును జెట్టు మొదటఁగడిగి చేయిపట్టు కొని యతనిని "ఎండ తీక్ష్ణముగనున్నది; లోనికి రండు!" అని గృహములోనికిఁ గొనిపోయెను.

అప్పటినుండియు సీతాకాంతము మనో రంగమున ఆకులు మొగ్గలతోఁ గూడియున్న యాచిన్నమొక్క నాట్య మాడుచుండెను. "ఈపాటి కాకొమ్మయాకులు వాడిపోవును! మొగ్గలు మాఁడిపోవును" అని పాప మాపురు షుఁడారాత్రితీవ్రజ్వరమునఁ బలుమాఱుఁ బల వరించెను. దేహస్వాస్థ్యము కలిగిన యొకటి రెండుదినములకొకనాఁ డాతఁడు వాకిట బచా రుచేయుచుండెను. దూరమునఁ బచ్చఁగఁ గానఁబడ అదియేమగునా యని యచటికిఁ బోయి; చూచునంతకు తానుగొన్నిదినముల క్రిందటఁ బెఱికివేయఁబూనిన బిళ్లగన్నేరు మొలక యాతనికిఁ గానిపించెను. ఆమోక యపుడె చచ్చిపోయెనని యతఁ డెంచెను. దానివిషయమే యతఁడు మఱచిపోయెను. అదియిపుడు క్రొత్త కొమ్మలు పెట్టి పూ వులు పూచుచుండుటవలన నతనికెంతో సం తోషముగలిగెను. ఆచెట్టుచుట్టును పాదుచేసి జానకమ్మ యనుదినము నీరుపోయుచుండుట చేత నదియింత త్వరితముగ నెదిగెను. పుత్త్ర నిస్మృతి తొలఁగిపోవలయునని చెట్లు చెండా డినసీతాకాంత మిపుడు పుత్త్రునిస్మృతికొఱకే వానిఁబోలిన యాచిన్నిమొలకను గాపాడఁ బూనెను! ఆపూవులచెట్టుచుట్టును నేలచదును చేసి, నీరుప్రవహించుటకై యతఁడు బోదెలు

...సంఖ్య... 18-10-1986

కట్టెను. త్వరితకాలములోనే యామొక్క బాగుగఁ బెరిగి దర్శనీయ మయ్యెను.

వేకువ నిద్ర లేవఁగనే సీతాకాంత మా మొక్క దగ్గఱకుఁ బోయి లెక్క లేని యెఱ్ఱని పూలనుబెట్టి కనుల పండువుచేయు దానిని దర్శించి ముదమందుచుండును. ఆచెట్టును దనసుతునికి మాఱుగాఁ జూచుకొని, దానిపోషణముననే యతఁడు కాలము గడుపును. చీడపట్టినయాకులు త్రుంపివేయును. చుట్టు నుండు రాలఁదొలఁగించి, మెత్తనిమట్టిచేర్చును. కలకల నవ్వునటులుండు దానిపూవులను దన పుత్త్రుని మందహాసములని భ్రమించును! మలయమారుతమున కించుక చలించు దానికొమ్మలను దననుజేరఁబిలుచు సుతుని మృదుకరములని తలపోయును! వేకువనె రాలు మంచుబిందువులు, రాత్రియంతయుఁ దనవియోగమునకు వగచి, కొమరుఁడు రాల్చు కన్నీరని యతఁడు భావించి కంటనీరు వెట్టుకొనెను.

ఒకనాఁటియుదయమున సీతాకాంతము పూవులమొక్కవైపునకునడచిపోయెను. చెట్టు నిండ పుష్పములు వికసించియుండెను. కోమలములగు నాయరుణకుసుమము లవలోకించిన కొలఁది వానిమనసు గంభీర భావపూరిత మయ్యెను. పగ లెప్పుడుచూచినను ఆమొక్క క్రొత్తపూవులతోనె చెన్నొందుచుండును. ఎపుడు వీక్షించినను గలకల నవ్వుచుండును. దీనిభావమేమి? మల్లె మొదలుగాఁగల కుసుమములకుఁగల సువాసనలు దనకులేవని తల వ్రాల్చి పరిమితముగాఁబుష్పించుటకు మాఱుగ నీచెట్టు లోకులుకోరని యీకోరకముల నిట్లు కుప్పలుకుప్పలుగఁ దొడగనేల? నోరులేని యీచిన్ని మొలకవలనఁ దాను నేర్చుకొనఁదగుధర్మము లేదా? చెట్టునకంటె నెన్నియో మడుఁగు లధికజ్ఞాన ప్రజ్ఞాదులచే భాసిల్లు మనుష్యజన్మమెత్తిన సీతాకాంతము, ఇహలోకమునఁ బ్రాపించిన కష్టములకేల యింతగ వెతనొంది, ధైర్యవిహీనుఁడై యసమయవైరాగ్య మూనవలయును? దుఃఖమున కింతగఁ గ్రుంగి తనకు దైవమిడిన శక్తుల నడవిపాలైన వెన్నెలవలెఁ జేసి అతఁడు నియతకార్యములనేల విడిచిపెట్టవలయును? "లేలెమ్ము, సీతాకాంతమూ! ఇంక నీవిచారమును ద్యజించి కర్తవ్యమునకుఁ గడంగుము" అను సుమనస్సందేశ మాతని వీనులకు వినవచ్చినటులుండెను!

చెట్లు తన బంధుగణములోనివే యని భావించి సీతాకాంత మిపుడు తనపెరటిలోనింకను మొక్కలు నాటఁజొచ్చెను. అచిరకాలముననె వారిదొడ్డి మొక్కలతోను తీగెలతోను సొబగొందుచుండెను. వట్టివ్యసనమున వెతనొందు పతి కిట్టి వ్యావృత్తి గలుగుటకుఁ గొంత సేదదేరి, జానకమ్మ, తోఁటపనియందు దోడ్పడి వానికి నిక్కంపు సహధర్మచారిణి యయ్యెను. కొలఁదికాలములోనె తాముగల్పించుకొనిన యీక్రొత్తపనియందు, పుత్త్రుని మఱచిరని చెప్ప వలను పడదుగాని, పుత్త్రశోకమొకింత యాదంపతులు మఱచిపోయిరి. వారిపుడు పెరటిలో నాటు చెట్లన్నియు దమ కొమరుని స్మృతి కొఱకు వేసినవే. ప్రియపుత్త్రుని గూర్చియె వారాచెట్లకు సంరక్షణ చేయు

చుండిరి. తమ తోఁటకుఁ గొమరుని నామమే యొసంగిరి.

కుక్క పిల్ల

ఈవ్యావృత్తివలన నాదంపతులు కొంత దుఃఖోపశాంతి గాంచియున్నను, ఇంకను వారు వీథి ముఖము చూచుటకు సాహసింపరైరి. ఇటీవల వారు పూనిన వైరాగ్యమే దీనికిఁ గారణము. మనస్సంకల్పితములగు సంకెలలు వీడుట కష్టము. ఒకనాఁడు, సీతాకాంతము వాకిటఁదిరుగుచు నొక కుక్క యేడుపువినెను. ఆయార్తనాదమే రాత్రియంతయు ఆదంపతుల వీనులకుఁ దగులుచుండి వారినిద్దురఁ బాపెను. ఇంతవఱకుఁ దా మాకుక్కసంగతి కనిపెట్టకుండుటకు వారంత వెతఁజెందిరి. వేకువనె సీతాకాంతము వీథితలుపు తెఱచి, గాయముచే మూలుగుచున్న యొకకుక్కపిల్లను జూచెను. గోతిలోనుండి యాకుక్కపిల్ల నీతఁడు వెలికిఁదీసి బురద గడిగివైచి, గాయము పరీక్షించుచుండగా చుట్టుపట్టులవారు వచ్చిరి. రెండుదినముల క్రిందట బండిచక్రము దానిమీఁదుగాఁ బోవుటచేత కుక్కపిల్లకా లిపుడు వాచియుండెనని వారు చెప్పిరి. మనుష్యుల బాధలే లెక్కచేయని లోకులు కుక్కలబాధలు పాటింతురా? కావున నేయీ రెండుదినములనుండి యాకుక్కపిల్ల బాధతోఁ గొట్టుకొనుచుండెను. సీతాకాంతమపుడు దానినిఁ బశుచికిత్సాశాలకుఁ గొనిపోయి, యచట దానికిఁ గట్టు కట్టించెను. ఆతఁడిట్లు వెంటనె యానోరెఱుఁగని జంతువును గొనిరానిచో బాధ మితిమీఱి, చికిత్సయసాధ్యమై యది చనిపోయి యుండెడిదని వైద్యుఁడు చెప్పి, వాని భూతదయ నభినందించెను. కొన్నిదినము లిట్లు కుక్కనిమిత్తమై తిరుగుచు సీతాకాంతము లోకవ్యవహారములఁ బాల్గొన నారంభించెను. అంత నొకనాఁడు మధ్యాహ్నము వీథితలుపునొద్ద శబ్దము విని తలుపుతీయగా స్వస్థపడి వచ్చిన కుక్కపిల్ల సీతాకాంతమునకుఁ గనఁబడెను. అది తనదారిని దానుబోక, తోఁకయాడించుచు రక్షకునియెడ ప్రేమ కృతజ్ఞతలు దెలుపుచు వానితో లోనికి వచ్చెను. మృత్యువునోటినుండి తప్పించుకొని నయాకుక్కమీఁద నాగృహస్థులకు జాలిపుట్టి వారు దానినిఁ బోషింపఁదొడంగిరి. క్రమక్రమముగ వారికి శునకము మీఁదఁ బ్రేమ పెరిగెను. సంసారమునందలి తగులాటము లిటుల

"సీతాకాంతము కుక్కపిల్లను......వెలికిదీసి......
గాయము పరీక్షించుచుండగా...చుట్టుపట్టులవారువచ్చిరి"

నానాఁట విజృంభించి, తమ వైరాగ్యమును బారఁ ద్రోలుచుండుట కాదంపతు లాశ్చర్య

"తలుపుతీయగా...కుక్కపిల్ల సీతాకాంతమునకుఁ గనఁబడెను"

పడియు, చేయునదేమియు లేక, నియత కార్యములే చేయుచుండిరి!

శాంతమ్మ

చేతులకుఁ దగినంత పనియున్నను, ఆదంపతుల మనస్సు మాత్ర మొక్కతఱి పూర్వపుదుఃఖవిషయమునకు మఱలుచుండెను. కాని వారి హృదయక్షేత్ర మిపుడు నిర్జలప్రదేశమగునెడారి కాక, ప్రేమనదీ జలార్ద్రమయ్యెను. ఆదయాంబువులఁ గ్రోలి జీవించున విపుడు కొన్నిచలన మెఱుఁగని చెట్లును, నోరులేనిజంతువులును! మనుజుల కాదయామృత మింకను లభ్యముకాకుండెను. నరుల కృపాకృతజ్ఞతలయం దాదంపతులకు నమ్మకము సడలిపోయి, వారు తమదయకు యోగ్యులుకారని భావించిరా యనునట్టు లింకను వారి వీధి తలుపు నిరంతరము మూయఁబడియే యుండును! ఒకనాఁడెవరో వచ్చి పిలుచుటచేత వారు తలుపు తీసిరి. వచ్చినవారు శాంతమ్మయు కుమారుఁడును. చిన్ననాఁడు బీదస్థితియం దుండునపుడు శాంతమ్మ కాదంపతులు మిక్కిలి సహాయము చేసిరి. వారివలననే తన విద్యాపరిపోషణ మయ్యెనని గుర్తెఱిఁగి తాను జేయఁగల సహాయ మీకష్టసమయమున వారికిఁ జేయుటకే, భర్త యనుమతిఁగైకొని యిపుడాకాంత కొంతకాలము వీరిని గనిపెట్టుట కిచటికిఁ బిల్లవానితో వచ్చెను. పరామర్శమను పేరుతో విందు లారగింప శాంతమ్మ వచ్చియుండలేదు. వాఙ్మాత్రమునఁగాక, క్రియారూపమునఁ దనభక్తి ప్రేమలచే నాదంపతులను బూజింపవలయు ననియే యాకోరికతో యిపుడు వారియిలు ద్రొక్కికొనివచ్చెను!

వారువచ్చిన కొంతతడవునకు శాంతమ్మయు జానకమ్మయుఁ గలసి ముచ్చటలాడుచుండిరి. నాలుగైదేండ్లు వయసుగల శాంతమ్మ చిన్నికుమారుఁడు వాకిటనున్న బిళ్లగన్నేరుపూవులఁ గోసి, తప్పటడుగులతో నడచివచ్చి, "తాతా! ఇదుగో!" నని సీతాకాంతమున కొకపూవిచ్చి, అమ్మమ్మచేత నొకటి యుంచెను. ఇది యుపేక్ష్యమగు సంగతియే. కాని, మనజీవితమునందలి పరిస్థితుల ననుసరించి, స్వల్పవిషయములె ఘనమైన విగఁ బరిణమిల్లుచుండును. దైవోపహతులగు నాదంపతుల కీబాలకుఁ డిచ్చు రెండుచిన్నపూ

వులును, అరవిరిసియున్న తమహృదయము లకుఁ బరిపూర్ణోన్మీలనము వెలయింపఁ బరమేశ్వరుఁ డనిచిన రెండుదివ్యసాధనము లాయనునట్టు తోఁచెను! పిల్లవానిని వారిరువురు ముద్దుపెట్టుకొనిరి. చిరకాలశోకనిమగ్నులైన



"తాతా ఇదుగో"

యీదంపతులు క్షణకాలము తమచింత మఱచి యెదుటనున్న బాలకుని ముద్దాడిరనిన, మానవహృదయము, దుఃఖాంధకారముచే నెంతయావరింపఁబడినను, మిన్కుమిన్కుమను నానందజ్యోతి దానియందింకను వెలుంగుచుండుననియే మనము గ్రహింపవలయును! ప్రేమామృతమింకను, ఆహృదయముల నిగిరిపోలేదనియే మనము భావింపవలయును. ఇట్టిసంగతులు పరికించి సంతసించిన శాంతమ్మ, తనయుపచారములవలన నింకను వీరిని సేదదేర్చి, వారిహృదయములందు ప్రేమాదిసద్గుణములు పల్లవింపఁజేయఁ బ్రయత్నించుచుండెను.

కొలఁదిదినములలోనే తాతమనుమలకు, ఏసామెతలోను గనుపట్టనంతటి మిత్రత్వము వాటిల్లెను! అనుభవజ్ఞుఁడగు తాత నిపుడు చిన్నమనుమఁడు, గ్రుక్కత్రిప్పకుండ ప్రశ్నములు వేయుచుండును. చిన్నచిన్న పనులందుఁ దాతకు మనుమఁడు కుడిభుజమయ్యెను. చిన్నమనుమని కెట్టి కథలు చెప్పి యెట్టి వినోదములు గల్పింతమా యని తాత యహర్నిశ మాలోచించుచుండును. ఇట్టి నూత్నప్రేమకుఁ దావలమైనదిగావుననే, సీతాకాంతము మనోగగన మిపుడు దుఃఖమేఘవిముక్తమై, సంతోషదీప్తులతోఁ దేజరిల్లుచున్నది. బాలకుని జూచుకొనుచున్న యానందమున సీతాకాంతమిపుడు తన దుఃఖమును మఱచిపోయెను.

క్రమముగ నతఁడు సాంఘికజీవనమునఁ దిరిగిపాల్గొనుచు, పరోపకారకార్యనిమగ్నుఁడై యుండెను. విపద్దశయందుఁ దాఁజిక్కుకొని యుండు నపుడు తనకన్నులు విప్పి చరణములను దిన్ననిత్రోవఁ ద్రొక్కించి, చేయూఁతనొసంగిన వారినందఱిని దనకుఁ దరణోపాయముఁ జూపినవారని యతఁడు భావించును. అలంటివిషయములే తనకన్నుల పొరలూడ్చెనని యతఁడు చెప్పుకొనుచుండును. కావుననే బిడ్డ గన్నారు

మొలక వానికిఁ దులసియుఁ గల్పవృక్షము నయ్యెను!

ఇప్పుడు శాంతమ్మయే యాదంపతులకు గూఁతురు,కొడుకును!ఆపొలఁతి ప్రోత్సాహము ననే జానకమ్మ దుఃఖము నణఁచుకొని, క్రమముగ దేశహితైకకార్యములలో నభిరుచి గలది యయ్యెను. నగరమందలి నారీమణు లిపుడు నడుపుచున్న సేవాసదనమునకు జానకమ్మయే కార్యదర్శిని.పట్టణమునజరిగెడి సకల సత్కార్య సమావేశములకును వారిల్లే యిపుడు కేంద్రస్థానము!

యమునాప్రాభవస్మృతి

పండిత పెనుమచ్చ సత్యనారాయణరాజు గారు

అమలాత్ముండును యోధుఁడున్ బృథుజగద్వ్యాపారమర్మజ్ఞుఁడౌ
కమలానాథుఁడు బాల్యచేష్ట లెచటం గావించె సానందుఁడై
ప్రమదానం గని తత్స్థలంబులు జలప్రక్షాళితాఘౌఘ యో
యమునా! నీవగుసైకతస్థలు లటం చస్రుల్ ధరన్ రాల్చెదన్

గీ. పెరిఁగి పెద్దయై యేతీర పరిసరమున, నస్త్రశస్త్రాదివిద్యల నభ్యసించె
నందనందనుఁ డాతీరమంది తీవె, యంచుఁ గన మేను బులకించు నమ్మ, యమున!

గీ. భవ్యభవదీయనీలాంబుపటలితోడఁ, దనదుమేచాయ లెంతయు మొనసి యాడ
జాములకొలంది యేనీట స్నానమాడు, బాలకృష్ణుండు తజ్జలమాల నీవె.

గీ. దేని పావనోదకములచే ననాథు, లైన పాండవుల ప్రతప్తమానసములు
శాంతి పొందింపఁబడియెనో వంత లుడుగ, నామహానది వగుదమ్మ, యమున! నీవె?

గీ యమునరో! దేవకీదేవి యఖిలవేది, నిఖిలజగదంతరవ్యాపి నీరజాక్షుఁ
డైన శ్రీకృష్ణు నుదరమ్ములోన నెమ్మి, నిడికొని యెటకుఁ గ్రుంకిడ నేఁగుదెంచు
నామహాపవిత్రాపగ వగుదు వీవ.